మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manananationalistvoice.com epaper.manananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 153 | 10 ఆదివారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


## గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

- బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగు
- కేంద్ర సహకారం కోరిన డిప్యూటీ సీఎం భట్టి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో భేటీ

**న్యూఢిల్లీ,మే 20నేషనలిస్ట్ వాయిస్**

బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

వివరాలు 2లో



## నేడు తమిళనాడు కేబినేట్ విస్తరణ విజయ్

02

మంత్రివర్గంలోకి ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

59 ఏళ్ల తరవాత తమిళనాట అధికారంలోకి కాంగ్రెస్

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

- యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం



**వాషింగ్టన్,మే20నేషనలిస్ట్ వాయిస్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్దానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు.



డేటా సిటీ కోసం 1500 ఎకరాల

# భూ సేకరణ

- జిల్లాలకు కూడా ఐటి విస్తరణ
- 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు
- ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన

**హైదరాబాద్,మే20నేషనలిస్ట్ వాయిస్**

ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్,కరీంనగర్,వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

వివరాలు 2లో

### డగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు

సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర నివేదిక

ఫోరెన్సిక్, డేటా సెంటర్లను పెంచాలి

ప్రభుత్వాదాయంపై గండికొట్టే వారిపై విజిలెన్స్

పోలీస్ ఉన్నతాధికారులతో భేటీలో సిఎం రేవంత్

02

## నేటినుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్న సిఎం రేవంత్

తొలి పుష్కర స్నానం చేయనున్న విజయేంద్ర సరస్వతి

హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం

**హైదరాబాద్,మే 20నేషనలిస్ట్ వాయిస్**

సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది.



## రాయలసీమలో తొలి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్

- 11 నెలల రికార్డు టైమ్‌లో పూర్తి చేసిన ఎస్ఎఇఎల్

02

- త్వరగా పూర్తి చేయడంపై చంద్రబాబు ఎక్స్ వేదికగా ప్రశంసలు

సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల

# ప్రత్యేక సాయం

- విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు
- నిర్మలా సీతారామన్‌ను కోరిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి

02



## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం

**న్యూఢిల్లీ,మే20నేషనలిస్ట్ వాయిస్**

భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రికత్తల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమవేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు.

## ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం

02



## ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'



02

- జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ
- ఇండ్లకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

# ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

మొదటిపేజీ తరువాయి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్,మే20నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం రాష్ట్ర ఆబ్కారీ, మధ్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1 లక్ష 20 వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయనీ, జూన్ నాటికి 2 లక్షల 35 వేల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,700 కోట్లతో శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా దశలవారీగా రూ.5 లక్షలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.మొదటి, రెండో విడతలకే పరిమితం కాకుండా అర్హత గల ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసీ జిల్లా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లోని కొరారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలను తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా మహిళను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరాలకు గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

డెమొక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమొక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మొదటిపేజీ తరువాయి

# గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

మొదటిపేజీ తరువాయి

ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్?ఎఎ తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్ ఎఎను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ ఎఎ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎకు ఓఓఆఖీ చట్టం, 1957లోని సెక్షన్ 5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్ ఎఎ కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమలో తొలి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్

**అమరావతి,మే20నేషనలిస్ట్ వాయిస్**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా ఏపీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024' కింద తొలి భారీ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి అయ్యింది. రాయలసీమలో ఎస్ఎఇఎల్ సంస్థ ఏర్పాటు చేసిన 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుని.. ఈ నెల 22న ప్రారంభం కానుంది. కాగా, ఈ ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వానికి ప్రతిష్మాత్మక విజయంగా నిలిచింది. ఈ ప్రాజెక్టుపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు అన్నారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు రాష్ట్రంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ స్వచ్ఛ ఇంధన రాజధానిగా నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు నిర్మాణం పూర్తి కావడంపై మంత్రి లోకేశ్ స్పందించారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడి, 600 మెగావాట్ల సామర్థ్యంతో రికార్డు స్థాయిలో ప్రాజెక్టు నిర్మించినట్లు మంత్రి తెలిపారు. కేవలం 11 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పుకొచ్చారు. ఞాంఇఒ భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు మే 22న రాయలసీమలో ప్రారంభం కానుందన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో మేము కేవలం ప్రాజెక్టులకు శంకుస్థాపనలు మాత్రమే చేయము, రికార్డులనూ బద్దలు కొడతాం' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కాగా, రాయలసీమలో ఏర్పాటు చేసిన ఈ మెగా సోలార్ ప్రాజెక్టుతో భారీ స్థాయిలో గ్రీన్ పవర్ ఉత్పత్తి జరగనుంది. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

# విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు

**న్యూఢిల్లీ,మే 20నేషనలిస్ట్ వాయిస్**

విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం అందించాలరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న భట్టి బుధవారం నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం, విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. 2014-2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని నిర్మలా సీతారామన్ దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, దీనిలో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

**న్యూఢిల్లీ,మే20నేషనలిస్ట్ వాయిస్**

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో (క్షఖఅ) 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ఞాక్షఖ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

# నేడు తమిళనాడు కేబినేట్ విస్తరణ

**చెన్నై,మే20నేషనలిస్ట్ వాయిస్**

దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారం నాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్ లు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళనాడు క్యాబినెట్‌లో మంత్రులుగా గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు. తమిళనాడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దేశిరచిన సంక్షేమ, ప్రజానుకూల ప్రభుత్వ విజన్‌ను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని ఆ పోస్టులో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. సుదీర్ఘ కాలంగా డీఎంకేతో పొత్తు సాగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకుండా పరోక్షంగా మద్దతు కొనసాగస్తూ వచ్చింది. ఇటీవల ఎన్నికల అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎంకే పార్టీతో పొత్తుకు ఉద్వాసన చెప్పి విజయ్ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆ పార్టీతో జతకట్టింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు గాను టీవీకే 118 స్థానాల్లో గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు 10 సీట్లు తగ్గడంతో పొత్తులకు తెరతీసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంల్, వీసీకేలు విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో విజయ్ ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది క్యాబినెట్‌లో చేరారు.

మొదటిపేజీ తరువాయి

# డేటా సిటీ కోసం 1500 ఎకరాల భూ సేకరణ

మొదటిపేజీ తరువాయి

'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఐటీ , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ పెంచారు. ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల రివ్యూ మీటింగ్‌లో రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్, ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడంపై సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ ప్రతిష్టాత్మక డేటా సిటీ నిర్వహణకు భారీగా నీటి అవసరాలు ఉంటాయని, అందుకోసం ఫ్యూర్ వాటర్ కాకుండా ఎస్ టీ పీ ల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ఎ÷-లాన్ చేయాలని అధికారులకు సీఎం సూచనలు ఇచ్చారు. అలాగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్, పెద్ద పెద్ద డేటా సెంటర్ల ఏర్పాటు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఈ జీసీసీల ఏర్పాటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టేలా సరికొత్త ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ అయిన టీ-ఫైబర్ పై సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను కూడా మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని మోడీని కలిసి రిక్వెస్ట్ చేస్తానని సీఎం అధికారులతో పేర్కొన్నారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేందప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

# డ్రగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు

**హైదరాబాద్,మే20నేషనలిస్ట్ వాయిస్**

డ్రగ్స్ బాధితుల కోసం ప్రత్యేక డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ ఆర్‌డి బోధి పెవిలియన్ లో పోలీస్ సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి,డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి ,అదనపు డీజీ లు,పోలీస్ కమిషనర్ లు,ఐజీ లు. సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిం మాట్లాడుతూ... డిపోర్టమెంట్ లో ఎస్ ఐ నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ తరవాత 2 ఏళ్ల పాటు ఇతర విభాగాల్లో పని చేయాలన్నారు. దీనిపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,డీజీపీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ పైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అన్నారు. ఫోరెన్సిక్ సెంటర్స్,డేటా సెంటర్లని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ ట్రైనింగ్ లోనే సైబర్ క్రైమ్ విభాగం లో పని చేయడం కోసం సెలక్షన్ జరగాలని సూచించారు. అన్ని విభాగాలు,ఉన్నతాధికారుల మధ్య సమన్వయం బాగా పెరగాలన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ లో సైబర్ క్రైమ్ పైన పోలీస్ విభాగం కోసం ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలి.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారి పైన విజిలెన్స్ దృష్టి పెట్టాలి.. డేటా అనాలిస్ ఆధారంగా ఆర్గనైజ్ క్రైమ్ పైన విజిలెన్స్ విభాగం దృష్టి సారించాలి.. విజిలెన్స్ కు మరిన్ని అధికారాలు ఇచ్చే అంశం పైన అధ్యయనం చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా అగ్ని ప్రమాదాలు జరగకుండా ్గ÷ర్ డిపా÷-టం÷-మెంట్ చర్యలు తీసుకోవాలి.. మునిసిపల్ డిపార్ట్‌మెంట్ ,హైడ్రాతో సమన్వయం చేసుకొన్ని ్గ÷ర్ డిపోర్టమెంట్ పైన జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. నాల ల మెయింటెన్స్ లో మెట్రో వాటర్ వర్క్స్ విభాగం తో సమన్వయం చేసుకోవాలి. మ్యాన్ హోల్స్ నిర్వహణ పైన పోలీస్, ట్రాఫిక్ పోలీస్,హైడ్రా,మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి నగరంలో అడ్డగోలుగా ఫెక్సీ లు కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

## -బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి-జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మే20(నేషనలిస్ట్ వాయిస్):**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జూన్ 2026 నుండి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలు సేకరిస్తారని చెప్పారు.ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుండి ప్రారంభమై 24-07-2026లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం 31-07-2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, 31-07-2026 నుండి 30-08-2026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 01-10-2026న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్-2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో "సెర్చ్ బై ఎలెక్టర్ డిటైల్స్" ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికీ అవకాశం



ఉంటుందని తెలిపారు. ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ మరియు "బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో" సౌకర్యాలను వినియోగించుకోవచ్చని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత ఫారాల నింపే విధానంపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దేవి ప్రసన్న, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల జమలయ్య, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తూకం వేసినా.. తరలింపు శూన్యం!

## - తహసీల్దార్‌కు బట్టాపూర్ ఉప సర్పంచ్ దయానంద్ వినతి

**ఏర్గట్ల, మే 20, (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)**

ఏర్గట్ల,: మండలంలోని ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ సొసైటీల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుండటం సంతోషకరమని, అయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని బట్టాపూర్ ఉప సర్పంచ్ మూడ్ దయానంద్ కోరారు. బుధవారం ఆయన తహసీల్దార్ మల్లయ్యకు కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.?ఈ సందర్భంగా బట్టపూర్ ఉప సర్పంచ్ మూడ్ దయానంద్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరతతో పాటు హమాలీల సమస్య తీవ్రంగా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల సొసైటీల ద్వారా హమాలీలు వరి బస్తాలను నింపుతున్నప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో హమాలీల కొరత కారణంగా ధాన్యం కుప్పలు అలాగే ఉండిపోయాయని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బట్టాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో హమాలీల కొరత ఎక్కువగా ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి అదనపు లారీలు, ఇతర రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని, ఇప్పటివరకు తూకం వేసి సిద్ధంగా ఉంచిన వరి బస్తాలను తక్షణమే మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, హమాలీల సంఖ్యను పెంచి పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని త్వరగా బస్తాల్లో నింపేలా సొసైటీలను ఆదేశించాలని ఆయన తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, మే20(నేషనలిస్ట్ వాయిస్):**

ఇంచార్జ్ జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే.అజయ్ కుమార్ ఆదేశాల మేరకు సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు వచ్చే నెల రెండో తేదీన నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సెంట్రల్ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ ఛాంబర్ కార్యాలయం నందు డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ కేసా నారాయణ రావు, కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ, సివిల్, ఈ అండ్ ఎం, ట్రాన్స్పోర్ట్, ఫైనాన్స్ మెడికల్ డిపార్ట్మెంట్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ కేసా నారాయణరావు మాట్లాడుతూ కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు తెలంగాణ ఆవిర్భావ సెంట్రల్ వేడుకలు జరుపుకొనుటకు కావలసిన ఏర్పాట్లును చేయాలని సంబంధిత శాఖలకు అధి కారులను ఆదేశించారు. సింగరేణి పాఠశాలల కళాశాలల విధ్యార్ధులు సింగరేణీయులు వారి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అదే విధముగా హెడ్ ఆఫీస్ ను విద్యుత్ దీపాలతో అలంక రించాలని అందుకు అవసరమయిన అన్ని ఏర్పాట్లను చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో జిఎం(ఈ అండ్ఎం) ట్రాన్స్పోర్ట్ ఎం.రామనాధం, ఏజిఎం (పర్సనల్) పిఎం వింగ్ జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ



కేశవ రావు, వై.వి.ఎల్.వరప్రసాద్, ముకుంద సత్యనారాయణ, డిజిఎం (ఈ అండ్ ఎం) వర్క్ షాప్ ఎం.రాజ శేఖర్, డిజిఎం(ఈ అండ్ఎం) ట్రాన్స్పోర్ట్ బి.సీతారాం, డివై సీఎంఓ డాక్టర్ కే.నాగరాజు, సివిల్ డిపార్ట్మెంట్ ఎస్ ఈ పి.రాజేంద్రప్రసాద్, ఎస్ఈ (ఈ అండ్ఎం) ఏ.నరేశ్ బాబు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ యం.డి.జాకీర్ హుస్సేన్, సెక్యూరిటీ జూనియర్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి, వెల్ఫేర్ పిఏ.కే.వర ప్రసాద రావు సంబంధిత డిపార్ట్మెంట్ ల అధికారులు పాల్గొన్నారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, మే20(నేషనలిస్ట్ వాయిస్):**

పాల్వంచ పోలీస్ స్టేషన్ ను బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి.నాగరాజు జీ.విజయ సిబ్బంది పాల్గొన్నారు.




# తూప్రాన్ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ స్కూల్‌లకు దీటుగా విద్యాబోధన

## -ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం. కంప్యూటర్ శిక్షణతో ఆధునిక విద్య-ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ..

## -ఇంటింటికీ వెళ్లి పర్యవేక్షణ చేస్తున్న హెడ్‌మాస్టర్







**తూప్రాన్, మే 20 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు తూప్రాన్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక విద్య, క్రమశిక్షణ, ఆంగ్ల బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇటీవల పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించగా, చిన్నారులకు మెరుగైన బోధన అందించేందుకు ఐజ పూర్తి చేసిన ఒక ఉపాధ్యాయురాలిని, ఒక ఆయాను నియమించారు. ప్రభుత్వం టీచర్‌కు నెలకు రూ.8,000, ఆయాకు రూ.6,000 వేతనం అందజేస్తోంది.పాఠశాలలో విద్యార్థులకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆట పాటల ద్వారా అభ్యాసం, ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వడం, వ్యక్తిగత శ్రద్ధతో పాఠాలు చెప్పడం జరుగుతోంది. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ూ× ఆధారిత కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తు న్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన కొనసాగుతోంది. ప్రతి తరగతి గదిలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్ ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థుల చదువుపై మరింత శ్రద్ధ పెట్టేందుకు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువు, హాజరు, ప్రవర్తనపై పర్యవేక్షణ చేయడం విశేషం.విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా రెండు జతల యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, రాగిజావ




అందిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ మాట్లాడుతూ "ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్ స్కూల్‌లకు ఏమాత్రం తీసిపోని విద్య అందిస్తున్నాం. తూప్రాన్ గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని కోరారు.

# పుట్టు చీర కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ఎస్ నాయకులు..

**దేవరకద్ర మే 20 ప్రజా విక్షణం**

మండల పరిధిలోని కోయిల్ సాగర్ గ్రామంలో బుధవారము ఉప సర్పంచ్ చిన్న యాదవ్ కుమార్తె పు ట్టుచీర కార్యక్రమంలో మండల బి ఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు ఎమ్మెల్యే చేత విత్తనాల పంపిణీ

**దేవరకద్ర మే 20 నేషనలిస్ట్ వాయిస్**



దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో రైతు వేదిక వద్ద గురువారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాల (జీలుగా) పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరు కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

## ఇంధన పొదుపులో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు వినూత్న అడుగు

**బాపట్ల : మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**



దేశంలో ఇంధన పొదుపును ప్రోత్స హించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఇచ్చిన పిలుపునకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మద్దతుగా నిలిచారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెట్రోల్,డీజిల్ వాడకాన్ని తగ్గించాలని అవగాహన కల్పిస్తూ.....ఆయన బుధవారం నియోజకవర్గంలో నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాలకు స్వయంగా ఎలక్ట్రికల్ స్కూటర్ పై ప్రయాణించారు. సమాజంలో మార్పు కోసం ఒక ప్రజా ప్రతినిధిగా ఆయన చూపిన చొరవ,ఆదర్శవంతమైన నడక అందరినీ ఆకట్టుకుంటోంది.

# చలివేంద్రంలో పుచ్చకాయ ముక్కల పంపిణీ

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

తాడేపల్లిగూడెం ఏపీ నీట్ ప్రధాన ముఖ ద్వారం వద్ద పైబోయిన వెంకట్రామయ్య (పీవీఆర్) యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రంలో బాటసారుల దాహార్తిని తీర్చే విధంగా మజ్జిగతో పాటు పుచ్చకాయ ముక్కలను జనసేన నాయకులు పైబోయిన వెంకట్రామయ్య బుధవారం స్వయంగా పంపిణీచేశారు. టన్ను పుచ్చకాయలను పివిఆర్ యూత్ కట్ చేసి మరి పాదచారులకు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పైబోయిన వెంకట్రామయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్ఫూర్తితో జనసైనికులు నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పివిఆర్ యూత్ ఆధ్వర్యంలో 10 ఏళ్ల నుంచి చలివేంద్రం నిర్వహిస్తూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా బాటసారులకు మజ్జిగతో పాటు పుచ్చకాయ ముక్కలు అందించాలని ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పివిఆర్ యూత్ సభ్యులు చురుగ్గా పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు పుచ్చకాయల పంపిణీ చేయటం విశేషం.




# కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

**దేవరకద్ర మే 20 నేషనలిస్ట్ వాయిస్**

నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోనిఅమ్మాపురంగ్రామ సమీపంలో ఉన్న పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద బుధవారము హుండీ లెక్కింపు చేసినట్లు ఆలయ కార్య నిర్వాహన అధికారి భువనేశ్వర్ రెడ్డి తెలిపారు. స్వామి వారి ఉండి లెక్కింపు చేయగా తొమ్మిది లక్షల పదివేల 630 రూపాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బత్తుల బాలరాజ్, ఆలయ ధర్మకర్త మండలి ప్రేమ్ సాగర్, భరత్ కుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది వారు తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 20 (నేషనలిస్ట్ వాయిస్):**

వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేట లో గల రైస్ మిల్, కోటపల్లి మండలం సర్వాయిపేటలో గల గోదాం, వేమన పల్లి మండల కేంద్రంలో గల గోదాములను సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వా హకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 20 (నేషనలిస్ట్ వాయిస్):**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, మొర్రిగూడలోని రాఘవేంద్ర రైస్ మిల్ గోదాము, చింతగూడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రం ను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీల సమన్వయంతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 20 (నేషనలిస్ట్ వాయిస్):**

గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి హాజరై, జిల్లాలో పని చేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్ల వివరాలు ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్ కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని, లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని, ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి అనుమతి తీసుకోవాలని, మూసివేసిన స్కానింగ్ సెంటర్ లో ఉన్న పరికరాలు, యంత్రాలను విక్రయించినట్లయితే కొనుగోలు చేసిన వారి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరు అరుణశ్రీ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ అభినవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డిపి.ఓ ప్రశాంతి, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ హారిక, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయండి

## - ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయమే పనులు ప్రారంభించాలి

## - పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఉపాధి హామీ పథకం కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం జూన్ 30 వరకు కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి పంచాయతీరాజ్ / గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వే పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని సూచించారు. ప్రతి రోజు పనుల కోసం ముందురోజే కార్మికుల సమీకరణ చేపట్టాలని, పనులు గ్రామ హాబిటేషన్ పరిధిలోనే ఉండేలా చూడాలని తెలిపారు. ఎండ తీవ్రతల దృష్ట్యా ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించి పనులను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. అసైన్డ్ భూముల్లో కూడా ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను చేపట్టి రైతులకు ఉపయోగకరంగా మలచాలని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం వేళల్లో జిల్లా కలెక్టర్లు స్వయంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి సుమారు 8 వేల మహిళా గ్రామ సంఘ భవనాలకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులను నిరంతరం చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల బ్యాంకు లింకేజి రుణాల రికవరీపై దివ్య మాట్లాడుతూ ఎన్‌పీఏలను జీరోకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలని తెలిపారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు రుణాల మంజూరు, స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపులు, ఎన్‌పీఏల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

# జిల్లాలకు కూడా ఐటి విస్తరణ

## - 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

## - హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు

## - డేటా సిటీ కోసం 1500 ఎకరాల భూ సేకరణ

## - ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు

## - అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్,కరీంనగర్,వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఐటీ , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ పెంచారు. ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల రివ్యూ మీటింగ్‌లో రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్, ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడంపై సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ ప్రతిష్టాత్మక డేటా సిటీ నిర్వహణకు భారీగా నీటి అవసరాలు ఉంటాయని, అందుకోసం ప్యూర్ వాటర్ కాకుండా ఎస్ టీ పీ ల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ఎ÷-లాన్ చేయాలని అధికారులకు సీఎం సూచనలు ఇచ్చారు. అలాగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్, పెద్ద పెద్ద డేటా సెంటర్ల ఏర్పాటు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఈ జీసీసీల ఏర్పాటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టేలా సరికొత్త ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ అయిన టీ-ఫైబర్ పై సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను కూడా మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని మోడీని కలిసి రిక్వెస్ట్ చేస్తానని సీఎం అధికారులతో పేర్కొన్నారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

# ఆదిలాబాద్ జిల్లాలో జొన్న రైతుల ఆందోళన

## - సకాలంలో కొనుగోల్ల లేక రోజుకోచోట ధర్నాలు

**ఆదిలాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

గతకొన్నిరోజులులగా జొన్న రైతులు ఆందోళన చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. తాజాగా బజార్ హత్నూర్ మండల కేంద్రంలో జొన్న పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జొన్న కొనుగోలు చేసి వారం గడిచినా కూడా లోడింగ్ చేయకపోవడంతో వర్షానికి మొక్కజొన్న సంచులు తడిసిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జొన్న పంట ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో జొన్న రైతులను వరుస కష్టాలు వెంటాడుతూనే ఉ న్నాయి. యాసంగిలో పండిన జొన్నల కొ నుగోళ్లను ప్రభుత్వం ఆలస్యంగా చేపట్టింది. దీంతో పక్షం రోజులుగా అమ్మకునేందుకు అవకాశం లేకుండా పోయింది. పొ లాల్లోనే జొన్నలను నిల్వచేసి రాత్రి, పగ లు కాపల ఉంటున్నారు. అదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించిన ఐదు రోజులవరకు కొనుగోళ్లు చేపట్టలేదు. దీంతో వర్షానికి పంట తడిసింది. ఆదిలాబాద్ జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు న మోదవుతుండగా ఎండలు మండిపోతున్నాయి. షెడ్యూల్ ప్రకారం పంటను సేకరిస్తామని ప్రకటించిన అధికారులు కొనుగోళ్లను తరచూ వాయిదా వేస్తున్నారు. వా యిదా అనంతరం ఈ నెల 14న కొనుగోళ్లను ప్రారంభించిన పీఏసీఎస్ సిబ్బంది ఐదు రోజులపాటు కొనుగోలు చేసి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మార్కెట్ యార్డులో పంట నిల్వలు పేరుకపోవడంతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి కొనుగోళ్లను ఎప్పుడు ప్రారంభిస్తామని విషయం చెప్పకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతుల వద్ద సేకరించిన జొన్న పంటను గోదాముల్లోకి తరలించడంలో జాప్యం జరుగుతున్నది. జొన్నల కొనుగోళ్లపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి అమ్మకాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో వేల క్వింటాళ్ల జొన్నలను కాంటా వేసి సంచుల్లో నింపిన లారీలు, హమాలీల కొరత కారణంగా గోదాముల్లోకి తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రైతుల పంటను కాంటా చేసిన పీఏసీఎస్ సిబ్బంది వారికి కొనుగోళ్ల పత్రాలు ఇవ్వడం లేదు. సంచుల్లో నింపిన జొన్నలు లారీల్లో లోడ్ చేసిన తర్వాత వివరాల పత్రాలు ఇస్తామని అప్పటి వరకు ఉండాలని సూచిస్తున్నారు. దీంతో రైతులు వారం రోజులుగా మార్కెట్ యార్డులోని సంచుల వద్ద రాత్రి, పగలు కాపలా ఉంటున్నారు. రోజుకు ఎనిమిది లారీలు వస్తున్నాయని ఐదు వేల సంచులు మాత్రమే రవాణా చేస్తున్నారని రైతులు తెలిపారు. రెండు రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం ఉండడంతో ఎప్పుడు వర్షం పడుతుందో, పంట తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తం కావాలి

## - కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడా

## - దిశానిర్దేశర చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**



తీవ్రమైనవడ గాలులు, ఎండ తీవ్రతపైవాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రతఎక్కువగాఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినసంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపైప్రత్యేకశ్రద్ధవహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రులవరకువైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగాఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయంఅందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశర చేయాలని రాష్ట్ర ప్రభుత్వప్రధానకార్యదర్శిరామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు

## - వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటూనే సడన్‌గా లేఆఫ్స్

**న్యూఢిల్లీ,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలో ఉద్యోగ తొలగింపులు ప్రారంభమయ్యాయి. సంస్థ తొలుత తమ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని చెప్పి.. సడన్‌గా లేఆఫ్ మెయిల్స్ పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, యూఎస్, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు తొలుత ఇంటినుంచే పని చేయాలని కంపెనీ తెలిపింది. అందుకు వారు సిద్ధమవుతుండగా.. సరిగ్గా తెల్లవారుజామున ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపింది. ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక, మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు తొలుత ఈ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకు భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటలకు వారికి అవి అందాయి. ఈ తొలగింపులకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా 10 శాతం అంటే.. దాదాపు 8,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనుంది. ఇందులో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలు ప్రభావం కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ఏడాది చివర్లో కంపెనీ మరికొన్ని తొలగింపులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 7వేల మందిని ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెలలె గేల్ ఇప్పటికే తెలిపారు.

# టిడిపి మహానాడులో 19 తీర్మానాలు

## - తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు- తీర్మానాల కమిటీ సభ్యుడు సోమిరెడ్డి వెల్లడి

**అమరావతి,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడులో మొత్తం 19 తీర్మానాలు ప్రవేశపెట్టాలని తీర్మానాల కమిటీ నిర్ణయించిందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వీటిలో తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు ఉంటాయన్నారు. తొలిసారిగా అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానం మహానాడులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి తీర్మానాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహా పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న మహానాడు కావడంతో పార్టీ శ్రేణులకు ప్రతిష్టాత్మకంగా మారిందని అన్నారు. ఈ మేరకు మిగతావి ఏపీకి సంబంధించిన తీర్మానాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీపై విమర్శలు గుప్పించారు సోమిరెడ్డి. గత రెండేళ్లుగా ఏపీలో పౌరులందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విధ్వంసానికి మారుపేరుగా గొడ్డలి పార్టీ మారిందని సోమిరెడ్డి మండిపడ్డారు. రెండేళ్లుగా ఏపీ సాధించిన పెట్టుబడులు గతంలో ఎప్పుడూ రాలేదని కొనియాడారు. సీఎం చంద్రబాబు బ్రాండ్, లోకేశ్ కృషి, పవన్ తోడ్పాటు, కేంద్రం మద్దతుతో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు సాధించామని పేర్కొన్నారు. నెల్లూరులో మహానాడు నిర్వహించలేకపోయామనే బాధ ఉన్నప్పటికీ.. పొదుపు చర్యల కోసం హైబ్రిడ్ విధానం తప్పలేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

# స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

## - ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన రవాణాశాఖ

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాసంస్థలు జూన్‌లో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులను రవాణా చేసే అన్ని విద్యాసంస్థల బస్సులు , ఇతర వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకొని నడుపుతున్న వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్ కచ్చితంగా ఉండాలని సూచించారు. వాహనాలలో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లకుడ్రైవింగ్ లైసెన్స్ , అనుభవం , ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ÷ర్ ఎక్సిటింగ్విషర్, ఎమ్జర్గ÷న్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు, విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించాలన్నారు. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేస్తామన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకునే వాహనాలలో తమ పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు రవాణా శాఖ సూచించింది.

# రాయలసీమలో తొలి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్

## - 11 నెలల రికార్డు టైమ్‌లో పూర్తి చేసిన ఎస్ఎఇఎల్

## - త్వరగా పూర్తి చేయడంపై చంద్రబాబు ఎక్స్ వేదికగా ప్రశంసలు

**అమరావతి,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా ఏపీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024' కింద తొలి భారీ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి అయ్యింది. రాయలసీమలో ఎస్ఎఇఎల్ సంస్థ ఏర్పాటు చేసిన 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుని.. ఈ నెల 22న ప్రారంభం కానుంది. కాగా, ఈ ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మక విజయంగా నిలిచింది. ఈ ప్రాజెక్టుపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు అన్నారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు రాష్ట్రంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ స్వచ్ఛ ఇంధన రాజధానిగా నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు నిర్మాణం పూర్తి కావడంపై మంత్రి లోకేశ్ స్పందించారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడి, 600 మెగావాట్ల సామర్థ్యంతో రికార్డు స్థాయిలో ప్రాజెక్టు నిర్మించినట్లు మంత్రి తెలిపారు. కేవలం 11 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పుకొచ్చారు. ÷ూంఇఒ భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు మే 22న రాయలసీమలో ప్రారంభం కానుందన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో మేము కేవలం ప్రాజెక్టులకు శంకుస్థాపనలు మాత్రమే చేయము, రికార్డులనూ బద్దలు కొడతాం' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కాగా, రాయలసీమలో ఏర్పాటు చేసిన ఈ మెగా సోలార్ ప్రాజెక్టుతో భారీ స్థాయిలో గ్రీన్ పవర్ ఉత్పత్తి జరగనుంది. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

## - పేలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం

**న్యూఢిల్లీ,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో (క్షఖఅ) 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ÷ూక్షఖ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

# క్రీడా స్ఫూర్తితో యువత ఉన్నత ... శిఖరాలను అధిరోహించాలి

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజులిమరియు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

## - తెలుగు యువత ఆధ్వర్యంలో అప్పలరాజుగూడెంలో ఘనంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ - యువతను నడిపించడంలో 'గన్నిన సురేంద్రనాథ్ చౌదరి' కృషి అభినందనీయం: ఎమ్మెల్యే

## - స్వయంగా బ్యాట్ పట్టి యువతలో జోష్ నింపిన శాసనసభ్యులు






**అప్పలరాజుగూడెం 20(నేషనలిస్ట్ వాయిస్)**

యువత క్రీడల్లో ముందంజలో ఉండాలని, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఏలూరు జిల్లా టీ.నర్సాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామంలో పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి నేతృత్వంలో, జంగారెడ్డిగూడెం మమత హాస్పిటల్ సహకారంతో భారీ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో పోలవరం ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మైదానంలో ఎమ్మెల్యే స్వయంగా బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి అక్కడున్న క్రీడాకారులను, యువతను ఎంతగానో ఉత్సాహపరిచారు. నియోజకవర్గంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి తీసుకుంటున్న చొరవను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, సురేంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతం కావడం సంతోషకర మన్నారు. అంతేకాకుండా "క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు.. శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి." అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. హాజరైన ముఖ్య అతిథులు – కూటమి నాయకులు ఈ ఉత్సాహభరిత కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి ప్రముఖ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు: గన్నిన సురేంద్రనాథ్ చౌదరి (పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు), జోనుబోయిన సోంబాబు (టి. నరసాపురం సొసైటీ చైర్మన్), కాల్నిడి వాసు (తెలుగు యువత అధ్యక్షులు), బొరగం శ్రీనివాస్ (రాష్ట్ర ట్రైకార్ చైర్మన్), పొట్ట రామారావు (ఏఎంసీ చైర్మన్), శీలం వెంకటేశ్వర రావు, జట్ల సత్యనారాయణ (టీడీపీ సీనియర్ నాయకులు), సాధనల బూసిబాబు, తమ్మిశెట్టి రాంబాబు, లవంకుల శ్రీరంగం, జబ్బా నాగరాజు, రమేష్ వర్మ,తొమ్మిదేళ్ల శ్రీనివాస్, చింతలపూడి నవీన్, బచ్చుల వెంకటేశ్వర రావు, టీ. నరసాపురం మండల యువత అధ్యక్షులు కాల్నిడి వాసు తదితరులు స్థానిక యువకులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

# నేటినుంచి సరస్వతీ అంత్యపుష్కరాలు

## - భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్న సిఎం రేవంత్

## - తొలి పుష్కర స్నానం చేయనున్న విజయేంద్ర సరస్వతి

## - హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

## - విస్తృతంగా ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం

**హైదరాబాద్,మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు. మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. 12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది. పుష్కర ప్రాంతంలో భద్రత కోసం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, సేఫ్టీ బోట్లను మోహరించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక హారతి, తెప్పోత్సవాలకు కూడా భారీ ఏర్పాట్లు చేశారు. అదనంగా రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయగా, నాగేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. మీడియా సెంటర్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది. కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం చేస్తారు. పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 టాయిలెట్లు ప్రత్యేకగా ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 300 మంది వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు నియమించారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు. ఈసారి సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అంచనా వేసి వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, టెంపుల్ తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కార ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

# గండిగూడెంలో తీరిన డ్రైనేజీ, చెత్త సమస్య

## - స్పందించి పనులు పూర్తి చేసిన పంచాయతీ అధికారులు
## - జనసేన యూత్ లీడర్ పింగళి మధు, గ్రామ పెద్ద శేషారావు కృతజ్ఞతలు





**గండిగూడెం, మే 20:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా టీ. నరసాపురం మండలం గండిగూడెం గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలను వేధిస్తున్న డ్రైనేజీ, పేరుకుపోయిన చెత్త సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. డ్రైనేజీ నీరు పొంగిపొర్లి ప్రధాన రహదారిపైకి వస్తుండటంతో పాటు, వీధుల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్వాసనతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు స్థానిక పెద్ద కొరువు శ్రీ శేషారావు, జనసేన యూత్ లీడర్ పింగళి మధు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యపై వారు తక్షణమే స్పందించి, సంబంధిత పంచాయతీ కార్యాలయ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజల ఇబ్బందులను, నేతల వినతిని అర్థం చేసుకున్న పంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. ఈరోజు పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా రంగంలోకి దించి, డ్రైనేజీ పూడికతీత పనులతో పాటు పేరుకుపోయిన చెత్తను పూర్తిగా క్లియర్ చేయించారు. రోడ్లను శుభ్రం చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జనసేన యూత్ లీడర్ పింగుల మధు మాట్లాడుతూ..."ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించి, డ్రైనేజీ, చెత్త సమస్యను వెంటనే పరిష్కరించిన పంచాయతీ కార్యదర్శి గారికి, సర్పంచ్ గారికి మరియు పారిశుధ్య సిబ్బందికి గండిగూడెం జనసేన తరఫున, గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని, రెగ్యులర్ పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నాం. అలాగే గ్రామ పెద్ద కొరివి శేషారావు మాట్లాడుతూ... తమ వినతిని గౌరవించి పంచాయతీ వారు వెంటనే స్పందించి పని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో కూడా అధికారులతో కలిసి అందరం ముందడుగు వేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# విజయవాడలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్ మీటింగ్

## - హాజరైన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20నేషనలిస్ట్ వాయిస్**

విజయవాడ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసులో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ ప్రణాళికలపై బోర్డు మీటింగ్ ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి), కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వలవల మల్లిఖార్జునరావు కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఇరువురు పలు అంశాలు, భవన నిర్మాణ కార్మికులకు అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలు, భవిష్యత్తు ప్రణాళికలు గురించి చర్చించారు. ఈ సమావేశంలో కమిషనర్ గ్రంథం చంద్రుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ శేషగిరి బాబు, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# మంచి పాలనకు మద్దతుగా నిలవండి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

కూటమి ప్రభుత్వం అందిస్తున్న మంచి పరిపాలనకు ప్రజలు మద్దతుగా నిలవాలని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పెంటపాడు మండలంలోని ముదునూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, ప్రజల వద్దకే పాలన, మన కోసం మన ఎమ్మెల్యే 'ప్రజాదర్బార్' ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అవినీతి, అరాచక పాలనతో ప్రజా ధనాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవినీతి లేని బాధ్యతాయుతమైన పరిపాలన అందిస్తున్నామని తెలిపారు. రైతుల భూములకు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోలు వేసుకొని, ఇబ్బందులు కల్పించారన్నారు. కూటమి పాలనలో రాజ ముద్ర తో పాస్ బుక్కులు అందిస్తున్నామన్నారు. రైతుల ధాన్యానికి 24 గంటల్లో సొమ్ములు ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి ఎటువంటి అవినీతి లేకుండా అందిస్తున్నామని అన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా సహించబోమని, ఎవరైనా లంచం అడిగితే వెంటనే తన కార్యాలయానికి తెలియజేయాలని



వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కట్టుబొయిన వెంకటలక్ష్మి, ఎమ్మార్వో సునీల్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ జీవీకే మల్లికార్జునరావు, ఎంపీడిఓ రాంప్రసాద్, బిజెపి ఇంచార్జ్ ఈతకోటి తాతాజీ, పుల్ల బాబి, ఆకాశపు స్వామి, పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్, మద్దాల మణికుమార్, కిలపర్తి వెంకటరావు, దత్తు ప్రసాద్, బరోడా శ్రీను, దాసరి అప్పన్న, బేతిన గిరి, పసుమర్తి రామ్ లక్ష్మణ్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, కొనగల హరినాథ్, వాడపల్లి సుబ్బరాజు, చెరుకూరి సోమశేఖర్, బుద్ధన నారాయణ, పసల కొండ తదితరులు పాల్గొన్నారు,

# ధాన్యం నిల్వలకు అదనపు స్థలాలు

## అధికారులను ఆదేశించిన కలెక్టర్

**నిర్మల్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

నిర్మల్ జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. నిర్మల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంటవెంటనే గోదాములకు తరలించాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేశ్, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇకపోతే నిర్మల్ జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలను పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా శ్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. . అందుబాటులో లేని రైతుల వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు.

# డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకు న్యాయం జరగాలి

## నిందితులకు కఠిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు

**నందిగామ, మే 20 నేషనలిస్ట్ వాయిస్**

గత వైసీపీ చీకటి పాలనలో దారుణ హత్యకు గురైన దళిత యువకుడు, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు కూటమి ప్రభుత్వం విశ్రమించదని నందిగామ శాసనసభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ శ్రీమతి తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. "తప్పు చేసిన వాడు ఎంతటి వాడైనా సరేడ చట్టం ముందు తప్పకుండా మోకరిల్లాల్సిందే!" అని ఆమె హెచ్చరించారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం నుండి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాటి వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలను, దళితులపై సాగించిన అరాచకాలను ఆమె తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ఆనాడు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు దారుణంగా హత్య చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, నాటి జగన్ రెడ్డి ప్రభుత్వం కేసును పూర్తిగా తొక్కిపెట్టిందని సౌమ్య మండిపడ్డారు. నిందితుడిని కాపాడేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారని, సాక్ష్యాలను నాశనం చేసి బాధిత కుటుంబాన్ని తీవ్ర మానసిక వేదనకు గురి చేశారని ఆరోపించారు. హత్యకు పాల్పడిన వారితో పాటు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసును తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి "నా ఎస్సీలు" అంటూ మాటల్లో తేనె కురిపించి, చేతల్లో మాత్రం ఆ వర్గాలకు తీరని అన్యాయం చేశారని తంగిరాల సౌమ్య విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలపై అణచివేత పరాకాష్టకు చేరిందని, దళితులపై దాడులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన దళిత ద్రోహాలన్నింటిపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం



చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె ఈ ప్రకటనలో స్పష్టం చేశారు.

# బైక్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

**యాదాద్రి భువనగిరి,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భువనగిరి బైపాస్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన ఓ లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతులను చందుపట్ల గ్రామానికి చెందిన జమ్మల లక్ష్మీకాంత్, సంగారెడ్డికి చెందిన వనపర్తి ప్రమోద్‌గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు. మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.

# మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆన్‌లైన్ మందుల అమ్మకాల కోసం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 817 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణం బంద్ విజయవంతమైంది. ఈ మేరకు మెడికల్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ షాపులు బంద్ పాటిస్తూ కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు చేయడం అధికంగా డిస్కౌంట్ ఇవ్వడం ద్వారా నాసిరకమైన మందులు మార్కెట్లో చలామణి అవుతున్నాయని, దీని ద్వారా చిన్న మెడికల్ షాపుల పై తీవ్ర ప్రభావం చూపడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ పాటిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 817 జీవోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## వర్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో కమిషనర్ ఏసుబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు పుట్టినరోజు వేడుకలను బుధవారం సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో పలువురు జనసేన నాయకులు పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబును శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. పుట్టినరోజు కేక్ ను కోసి తినిపించారు. ముందుగా కమిషనర్ ఏసుబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడుచాపల రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి మద్దాల మణికుమార్, సోషల్ మీడియా ఇన్ఛార్జ్ బైనపాలకు ముఖేష్, 24వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ సుబ్బారావు, జనసేన నాయకులు రాజేష్ తదితరులు మున్సిపల్ కమిషనర్ ఏసు బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.



# పేదల పెన్నిధిగా జనసేన

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

పేద ప్రజల పెన్నిధిగా జనసేన పార్టీ ఉంటుందని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రాజనగరం నియోజవర్గంలోని రాజ నగరం మండలం సూర్యపేట గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నపిల్లలు లోక్షితాదేవి, దీపిక తల్లి చనిపోవటంతో పిల్లలు అనాధలయ్యారు. వీళ్లిద్దరూ వారి అమ్మమ్మ దగ్గరే ఉంటూ ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ సభ్యులు, కూటమి నాయకులు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ వంతుగా రూ 50 వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక కార్యాలయంలో చిన్నారులకు ఎమ్మెల్యే బుధవారం అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పేద ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన శ్రామికులు జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు గల్ఫ్ దేశంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. గల్ఫ్ జనసేనకు ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లి దండ్రులు లేని ఈ బాలలకు జన




సైనికులు అందరూ కలిసి రూ.50వేల ఆర్థిక సహాయం అందించటం గొప్ప విషయమని ప్రశంసలజల్లు కురిపించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సేవే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పుల్లా బాబి, ఘంటా సుబ్రహ్మణ్యం, కామిశెట్టి శ్రీనివాస్, అడ్డగర్ల సురేష్, నల్లగంచి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం

### - ఆంధ్రప్రదేశ్ గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శనగన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చిటికెన శ్రీనివాసరావు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆంధ్రప్రదేశ్ గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శనగన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా చిటికెన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిగా మట్టా రామకృష్ణ, తాడేపల్లిగూడెం రూరల్ మండలం అధ్యక్షులుగా కొనకళ్ల బులివెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామగోపాల్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కోశాధికారి వీరంకి రంగారావు ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను గౌడ సంఘం రాష్ట్ర నాయకులు చలిమోలు అశోక్ గౌడ్, తాత శ్రీనివాసరావు బుధవారం రాత్రి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనగన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చిటికెన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని గౌడ కులస్తులందరి ఐక్యతకు పాటుపడటంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు అన్ని సంఘ సభ్యులకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. గౌడ కులస్తులు రాజకీయంగా ఎదగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారు వివరించారు.



# మండలంలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలి

- రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి
- బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిశీలన.
- గంజాయి, గుడుంబా, రాయితీ బియ్యం, పశువుల అక్రమ రవాణా పై దృష్టి సారించాలి.
- గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలి.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.





**ఆదిలాబాద్ జిల్లా మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

బజార్ హత్నూర్ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతూ పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి, బజార్హత్నూర్ ఎస్ఐ జి రమేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ యువతి కిడ్నాప్ కేసు సుఖాంతం

### - ఛేజ్ చేయడంతో పారిపోయిన దుండుగులు

**హైదరాబాద్,మే20 (నేషనలిస్ట్ వాయిస్)**

అత్తాపూర్‌లో యువతి కిడ్నాప్ కథ సుఖాంతంగా ముగిసింది. ఎట్టకేలకు యువతిని పోలీసులు ట్రేస్ చేశారు. మలక్‌పేట్‌లోని తన ఇంట్లోనే యువతి సేఫ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఫోన్ నంబర్ ఆధారంగా యువతిని పోలీసులు గుర్తించారు. అత్తాపూర్ జోయ్ ఆస్పత్రి వద్ద అర్ధరాత్రి యువతి కిడ్నాప్ అవడం సంచలనం సృష్టించింది. ఓ యువతిని కొందరు వ్యక్తులు థార్ కార్‌లో వచ్చి అందరూ చూస్తుండగానే బలవంతంగా కిడ్నాప్ చేశారు. విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగారు. యువతిని కిడ్నాప్ చేసిన కారును ఛేజ్ చేశారు. అయితే కిడ్నాపర్లు పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. కార్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో వివరాలు సేకరించడం పోలీసులకు కష్టంగా మారింది. జోయ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యువతిని కొందరు వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కిడ్నాప్‌కు ముందు యువతి ఆస్పత్రి పక్కనే ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వెళ్లి అక్కడ కొన్ని వస్తువులను కొనుగోలు చేసి.. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్ నంబర్ ఆధారంగా.. మలక్‌పేటకు చెందిన యువతిగా నిర్ధారించారు. అక్కడకు వెళ్లి చూడగా.. యువతి తన ఇంట్లోనే సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## ఘనంగా నోముల సత్యనారాయణ మనవరాలి పుట్టినరోజు వేడుకలు

### - హాజరైన కూటమి ముఖ్య నాయకులు

**టి. నరసాపురం:మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**





ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం ఆర్.కె.ఆర్. గూడెం (కాపుగూడెం) గ్రామంలో బుధవారం (లేదా నిన్న) నోముల సత్యనారాయణ మనవరాలు మొదటి పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ శుభకార్యంలో మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శీలం వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు కాల్నిడి రాంబాబు, టి. నరసాపురం సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు, తెలుగు యువత అధ్యక్షులు కాల్నిడి వాసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.అలాగే వీరితో పాటు కూటమి నాయకులు సాధనల బూసిబాబు, తమ్మిశెట్టి రాంబాబు, లవంకుల శ్రీరంగం, జబ్బా నాగరాజు, ఎస్.వి.పి.కె.హెచ్. రమేష్ వర్మ సహా పలువురు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నోముల సత్యనారాయణ కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులందరికీ ఘనంగా స్వాగతం పలికి, మర్యాదలు గావించారు. గ్రామంలో ఈ వేడుక విపరీతమైన కోలాహలాన్ని నింపింది.

# ఉపాధి హామీ పథకం కూలీల ఫేస్ యాప్ రద్దు చేయాలి

## - రెండుపూటల పని పద్ధతి నిలిపివేయాలి

## - సీఐటీయు బాపట్ల పట్టణ నాయకులు కె.శరత్

**బాపట్ల :మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలపై బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలోని సచివాలయ సిబ్బందికి సీఐటీయు బాపట్ల పట్టణ నాయకులు కె.శరత్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలం పనులు లేక కుటుంబాలు గడవక వ్యవసాయ కూలీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఉపాధి పథకాన్ని పేరు మార్చి 125 రోజులు పని కల్పిస్తామని అనేక ప్రకటనలు ఇచ్చి గతంలో ఉన్న అనేక నిబంధనలలో మార్పులు చేసి రెండు పూటల ఫేస్ యాప్ ఫోటోల పద్ధతి తీసుకురావడం ద్వారా అనేక చోట్ల పనిచేసినప్పటికీ సరైన సమయంలో ఫోటోలు అప్లోడ్ కాక వ్యవసాయ కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అందువల్ల తక్షణం రెండు పూట్ల ఫోటో పద్ధతిని రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు.ఉపాధి హామీకి మన రాష్ట్రానికి 10 వేల కోట్ల రూపాయలను కేంద్రం నిధులు కేటాయించాలని, సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని, వేసవి కాలంలో మంచినీళ్లు,మజ్జిగ సౌకర్యం కల్పించచాలని,30 రోజులు పని చేసిన కుటుంబానికి పనిముట్లు, ప్రతి గ్రూప్ కి టెంట్,మెడికల్ కిట్




ఇవ్వాలని,ఉపాధి వేతనదారులు ప్రమాదంలో మరణిస్తే 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేసీయా ఇవ్వాలని, కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని,రోజుకి వేతనం రూ.700 లు ఇవ్వాలని,అవినీతిని అరికట్టాలని, పని ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న వారికి పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని,పాత బకాయిలు, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# కుందురు చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి అన్నా రాంబాబు నివాళి

**తర్లుపాడు, మే 20 (నేషనలిస్ట్ వాయిస్):**

తర్లుపాడు మండలం తుమ్మలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు/అభిమాని కుందురు చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆయన దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు తుమ్మలచెరువు గ్రామాన్ని సందర్శించారు.చంద్రశేఖర్ రెడ్డి నివాసానికి చేరుకున్న ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు. చంద్రశేఖర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బత్తుల రామారావును అభినందించిన వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి






**పెనుగంచిప్రోలు, మే 20 నేషనలిస్ట్ వాయిస్**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావును పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక మాధ్యమాల్లో సోషల్ మీడియా నిత్యం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, బత్తుల రామారావు పేజీ మూడు లక్షల ఫాలోవర్స్ మైలురాయిని దాటింది. ఈ అరుదైన సందర్భంగా తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బత్తుల రామారావు డిజైన్ చేసిన ప్రత్యేక వైఎస్సార్సీపీ లోగోను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు పార్టీకి చేస్తున్న సేవలను కొనియాడిన జగన్, భవిష్యత్తులోనూ ఆయనకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇటీవల పెనుగంచిప్రోలు గ్రామంలో జరిగిన బత్తుల రామారావు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు అనివార్య కారణాల వల్ల వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈరోజు రామారావు కుటుంబ సభ్యులను ఆయన స్వయంగా తాడేపల్లి లోని తన నివాసానికి పిలిపించుకున్నారు. నూతన వధూవరులు విజయ్ - రజితలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అధినేత తమను పిలిచి మరీ ఆశీర్వదించడం పట్ల బత్తుల రామారావు కుటుంబ సభ్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పచ్చిరొట్ట విత్తనాలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి...

## - వ్యవసాయ అధికారి కె.రాంబాబు

**పోలవరం మే 20 (నేషనలిస్ట్ వాయిస్ )**

పచ్చిరొట్ట విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోలవరం మండల వ్యవసాయ అధికారి కె రాంబాబు అన్నారు.పోలవరం మండలంలోని ఖరీఫ్ 2026 సీజన్ నందు పచ్చిరొట్ట విత్తనాలు 50% రాయితీపై పోలవరం 1, పోలవరం 3 , పట్టిసీమ, గూటాల 1, గుటాల 2 రైతు సేవా కేంద్రాల్లో జీలుగా 55 క్వింటాలు , జనుము 10 క్వింటాడు, పిల్లి పెసర 5 క్వింటాలు, ట్రైబల్ రైతులకు సంబంధించి ప్రగడపల్లి, వింజరం, ఎల్ ఎన్ డి పేట , జిల్లేలగూడెం పంచాయతీలకు 55 క్వింటాల జిలగా, 50 క్వింటాలు జనము, 10 క్వింటాలు పిల్లపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అన్నారు. బుధ వారం పోలవరం మరియు పట్టిసీమ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. పచ్చి రొట్ట వేసే రైతులందరూ కూడా మీ యొక్క ఆధార్ నెంబర్ తీసుకుని సమీప రైతు సేవా కేంద్రంలో పేర్ల నమోదు చేయించుకుని విత్తనాలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు, టిడిపి మండల కన్వీనర్ మంగిన కొండ, పాత పట్టిసీమ సొసైటీ ప్రెసిడెంట్ నునకాని రాంబాబు, నీటి సంఘం ప్రెసిడెంట్ పాదం ప్రసాద్, రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.





# ఉపాధి కూలీలకు అండగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## - దర్భగూడెంలో కార్మికులకు స్నాక్స్, శీతల పానీయాల పంపిణీ

## - అవినీతికి తావులేకుండా పనులు జరగాలి: అధికారులకు ఆదేశం





**జీలుగుమిల్లి, మే 20:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం స్నాక్స్ మరియు శీతల పానీయాలను పంపిణీ చేశారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పని ప్రదేశానికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే.. అక్కడ జరుగుతున్న పనుల వివరాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పనితీరు, కార్మికులకు అందుతున్న కనీస సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు.అలాగే "ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ, అవినీతికి ఎలాంటి తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం." అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఉపాధి హామీ కార్మికులు చేసిన పనికి అనుగుణంగా వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో సమయానికి జమ అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో జాన్ వేస్లీ, ఫీల్డ్ అసిస్టెంట్ చల్లారావుతో పాటు కూటమి నాయకులు తమ్మన సాంబశివరావు, సొసైటీ చైర్మన్ అక్కిశెట్టి విజయ ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ సింగూలూరి రామారావు, పైడిమల కృష్ణ, కొరస దుర్గారావు, చిలక వెంకటేశ్వరరావు, తణుకు శ్రీను, గుర్రం కాంతారావు, బొర్ర సురేష్, యారామల బాబురావు, కొప్పుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**బాపట్ల : మే 20 (నేషనలిస్ట్ వాయిస్)**

బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 56 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రూ.28,55,556 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.



# ఉపాధి హామీ పనులను పరిశీలించిన....

## - స్పెషల్ అధికారి వరప్రసాద్,
## - ఏపీవో వెంకటేశ్వరరావు

**పోలవరం మే 20 (నేషనలిస్ట్ వాయిస్ )**

ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ మైనర్ ఇరిగేషన్ డి ఈ మరియు స్పెషల్ అధికారి వరప్రసాద్, ఏపీవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.బుధవారం పోలవరం మండలం ఇటుకల కోట ఇసుక కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను స్పెషల్ అధికారి వరప్రసాద్ క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌళిక వసతులపై ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆరా తీసి పలు సూచనలు చేశారు.ఎండలు పెరుగుతున్నందున ఉపాధి శ్రామికులు ఉదయం తొందరగా వచ్చి పనులు పూర్తి చేసుకుని ఇంటికి తొందరగా చేరుకోవాలని సూచించారు.ఉపాధిహామీ పనులకు శ్రామికులు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ కొవ్వాడయ్య,మేట్లు, శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

## - జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 20(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ )**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెండు ఫోటోలు విధానం కారణంగా అనేక మంది గ్రామీణ పేద కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా వి.బి.జి./వికసిత్ భారత్ జీ–రంజీ చట్టం అమలులోకి వస్తే గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలు వంటి సిబ్బంది ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడతాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పాత విధానాన్ని కొనసాగిస్తూ కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు.

సంఘం ప్రధాన డిమాండ్లు ఇవీ:రెండు ఫోటోలు విధానాన్ని వెంటనే రద్దు చేయాలి.వి.బి.జి./వికసిత్ భారత్ జీ–రంజీ చట్టాన్ని రద్దు చేయాలి. ఉపాధి హామీ పాత విధానాన్ని కొనసాగించాలి.ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి కాపాడాలి. ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీసం ₹600 వేతనం చెల్లించాలి.పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, మెడికల్ సదుపాయాలు కల్పించాలి.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రత్యేక భత్యాలు, రక్షణ



చర్యలు చేపట్టాలి. సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలి. పని చేయదలచిన ప్రతి కార్మికునికి జాబ్ కార్డు ఇవ్వాలి.ప్రతి కార్మికునికి ₹10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలి. అవసరమైన పనిముట్లు ప్రభుత్వమే అందించాలి.పని ప్రదేశంలో ప్రమాదం జరిగినట్లయితే పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి.పట్టణ ప్రాంత పేదలకు కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలి.వ్యవసాయ కూలీలకు సరైన వేతన చట్టం తీసుకురావాలి.

ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మరియు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోర్కుటే రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారికి అండగా రక్తదాత

## - 29వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన
## - పోలవరం మండలం సిపిఐ కార్యదర్శి కారం భాస్కరరావు

**పోలవరం మే 20 (నేషనలిస్ట్ వాయిస్ )**

జంగారెడ్డిగూడెంలోని మమత హాస్పటల్ లో తలసేమియాతో బాధపడుతున్న 3 సంవత్సరాల చిన్నారికి అత్యవసరంగా ఎ బి పాజిటివ్ రక్తం అవసరమవడంతో వెంటనే స్పందించి పోలవరం మండలం సిపిఐ కార్యదర్శి కారం. భాస్కరరావు, 29వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.రక్తదానం చేయండిడ మరొకరికి జీవితాన్ని అందించండి.అనే సందేశంతో ఆయన చేసిన సేవ అందరినీ ఆకట్టుకుంది. అత్యవసర పరిస్థితిలో ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేయడం అభినందనీయమని వైద్యులు తెలిపారు.ఇప్పటికే 29 సార్లు రక్తదానం చేసిన ఆయన సేవా భావం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. తలసేమియా బాధితులకు తరచుగా రక్తం అవసరమవుతుందని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహకరించిన స్నేహితులు, రక్తదాతలు మరియు ఆసుపత్రి సిబ్బందికి ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




# రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ..
# అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 20(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమంలో భాగంగా కుమురం భీమ్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్. త్రివేణి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఏప్రిల్ నెల వేతనాలు ఇప్పటికీ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు. వేతనాలు ఆలస్యమవడంతో వేలాది మంది మహిళా ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వెంటనే ఏప్రిల్ నెల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ ఉద్యోగులు గత 50 సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ, ఇప్పటికీ సరైన వేతనాలు, చట్టబద్ధ హక్కులు, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ. 18,000 వేతనం, పీఎఫ్ సౌకర్యం తదితర హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.అలాగే ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్ఈపీ2020 విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, అంగన్వాడీ ఉద్యోగులపై సంబంధం



లేని పనులు, బిఎల్ఓ డ్యూటీలు మోపకూడదని అన్నారు.పెండింగ్‌లో ఉన్న సమ్మె వేతనాలు, పీఆర్సీ ఎరియర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేసి అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయాలా టీచర్స్ మధ్యలో జీత వ్యత్యాసం అధికంగా ఉందిని అది దనిని తగ్గించాలి అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో వై. అరుణ (జిల్లా కోశాధికారి), సునీత, రాణి, జయ గోల్దార్, లక్ష్మి, లలిత, అరుణ శ్రీ, పావని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంలో స్కూల్ బస్సుల తనిఖీలు

**పోలవరం, మె 20 (నేషనలిస్ట్ వాయిస్)**

రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మే 1 నుంచి స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పోలవరంలోని ఆర్‌సీఎం స్కూల్‌కు చెందిన ప్రైవేటు బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో మొత్తం 296 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటివరకు 29 పాఠశాలలకు చెందిన 248 బస్సులను పరిశీలించారు. భద్రతా లోపాలు ఉన్న 209 బస్సులకు లోపాలను సరిచేసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.పోలవరంలో కేడివి రవి గోపాల్, సిహెచ్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో 9 బస్సులను తనిఖీ చేశారు. స్కూల్ బస్సుల్లో అత్యవసర ద్వారం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ప్రథమ చికిత్స పెట్టె, వేగ నియంత్రణ పరికరం, జీపీఎస్ పరికరం, 185జి ప్రమాణాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు తప్పనిసరిగా చెల్లుబాటులో ఉండాలని సూచించారు. లోపాలు ఉన్న వాహనాలను సరిచేసుకుని ఫిట్‌నెస్ చేయించుకోవాలని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జ్ ఆర్టీవో ఎస్.ఎస్. రంగనాయకులు పాల్గొన్నారు.






# చింతకుంట గ్రామ ప్రధాన చెరువును కాపాడాలి గ్రామ ప్రజల ఆందోళన..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 20(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)మండలం చింతకుంట గ్రామ ప్రజల జీవనాధారమైన ప్రధాన చెరువు ప్రస్తుతం అక్రమ దందాదారుల చేతిలో నాశనమవుతున్నదని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు లోపల వరకు కంచెలు ఏర్పాటు చేసి, ఎలాంటి అధికార అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు నిర్వహించడం దారుణమని వారు మండిపడ్డారు.గ్రామానికి ప్రధాన జలవనరైన ఈ చెరువు భూగర్భ జలాల పెరుగుదలకు కీలకంగా ఉండగా, దానిని పరిరక్షించాల్సిన అధికారులు మరియు ప్రజాప్రతినిధులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, చెరువుకు నీరు చేరే ప్రధాన కాలువలు పూర్తిగా మూసుకుపోయే పరిస్థితి ఏర్పడినా సంబంధిత శాఖలు స్పందించకపోవడం గ్రామస్థుల ఆగ్రహానికి కారణమైంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక ఎవరి ఒత్తిళ్లు పనిచేస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ఆస్తిని కాపాడాల్సిన వారే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయడంతో పాటు చెరువు ఆక్రమణలను తొలగించి, మూసుకుపోయిన కాలువలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.





# హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**దేవరకద్ర మే 20 నేషనలిస్ట్ వాయిస్**

దేవరకద్ర మండల కేంద్రంలో ఈనెల 23న జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు కూడా పాల్గొని విజయవంతం చేయాలని పార్లమెంట్ బిజెపి ఇన్చార్జి పవన్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు, బుధవారము పవన్ కుమార్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటుచేసిన సమావేశం నిర్వహించి తదుపరి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల బిజెపి అధ్యక్షుడు కృష్ణం రాజు,దేవన్నసాగర్, నారాయణరెడ్డి,శ్రీశైలం,అనిల్ కుమార్, ఆర్ఎస్ఎస్ సంఘ కార్యకర్త నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవ్ పలు రికార్డులు నమోదు



రాజస్థాన్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ మరో సంచలన ఇన్నింగ్స్?తో ట్రెండింగ్?లోకి వచ్చాడు. తాజాగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో మ్యాచ్?లో 38 బంతుల్లోనే 93 పరుగులు బాది విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ క్రమంలోనే వైభవ్ పలు రికార్డులు నమోదు చేశాడు.అయితే ఐపీఎల్?లో తొలి సీజన్ నుంచి ఆడుతున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు సైతం ఏ ఎడిషన్?లోనూ ఈ ఫీట్ సాధ్యం కాలేదు. ఈ స్టార్ క్రికెటర్లు తమతమ కెరీర్?లో ఐపీఎల్?లో సింగిల్ ఎడిషన్?లో 50 సిక్స్?లు బాదలేదు. కానీ, పట్టుమని పాతిక మ్యాచ్?లు కూడా ఆడని వైభవ్ తన కెరీర్?లో రెండో సీజన్?లోనే ఈ అరుదైన ఫీట్ సాధించాడు. ప్రస్తుత ఎడిషన్?లో వైభవ్ తాజా మ్యాచ్?తో 500 పరుగుల మార్క్ దాటేశాడు. ఇప్పటిదాకా 13 మ్యాచ్?ల్లో 579 పరుగులు చేసిన అతడు టాప్?లో కొనసాగుతున్నాడు. దీంతో ప్రపంచంలోని ఏ టీ20 లీగ్?లో అయినా 500o పరుగుల మార్క్ టచ్ చేసిన అతిచిన్న వయసున్న క్రికెటర్?గా రికార్డ్ కొట్టాడు. ఇది ఐపీఎలే కాదు, వరల్డ్ రికార్డ్ కూడా. ప్రస్తుతం అతడి వయసు 15ఏళ్లు. ఈ సీజన్?లో వైభవ్ క్రీజులోవచ్చడంటే చాలు ఫోర్లు, సిక్సలతో తొలి ఓవర్ నుంచే బాదడం షురూ చేస్తున్నాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్ట్రైక్ రేట్?తో 500o పరుగులు చేసిన రికార్డు కొట్టాడు. ప్రస్తుతం అతడి స్ట్రైక్ రేట్ 233గా ఉంది. ఇదివరకు ఈ రికార్డు కోల్?కతా నైట్?రైడర్స్ ఆండ్రీ రస్సెల్ 205 (2019 లో) స్ట్రైక్ రేట్? పేరిట ఉండేది. ఈ లిస్ట్?లో వరుసగా అభిషేక్ శర్మ 202, నికోలస్ పూరణ్ 196 (2025లో), ట్రావిస్ హెడ్ (2024లో) 192 స్ట్రైక్ రేట్?తో ఉన్నారు 13 మ్యాచ్?ల్లో వైభవ్ 579 పరుగులు చేశాడు. ఇందులో 50 ఫోర్లు, 53 సిక్స్?లు ఉండడం విశేషం. అంటే బౌండరీలతోనే వైభవ్? 518 రన్స్ సాధించడన్నమాట! ఈ సీజన్?లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్?గా వైభవ్ టాప్?లో కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ ప్రస్తుతం అతడి దగ్గరే ఉంది.అంతర్జాతీయ క్రికెట్?లో అరంగేట్రం చేయకముందే ఐపీఎల్?లో అత్యధిక పరుగులు బాదిన మూడో అన్?క్యాప్డ్? బ్యాటర్?గా వైభవ్ కొనసాగుతున్నాడు. ఈ ఇన్నింగ్స్?తో రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ (573 రన్స్, 2024లో)?ను అధిగమించాడు. కాగా ఈ లిస్ట్?లో రాజస్థాన్ యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ టాప్?లో ఉన్నాడు. అతడు 2023లో రాజస్థాన్ తరఫున 625 పరుగులు చేశాడు. జైస్వాల్ తర్వాత రెండో స్థానంలో షాన్ మార్ష్ ఉన్నాడు. మార్ష్ 2018లో పంజాబ్ కింగ్స్ తరఫున 616 పరుగులు సాధించాడు. అయితే రాజస్థాన్ ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అలాగే ప్లేఆఫ్స్?కు క్వాలిఫై అయితే అక్కడా ఇంకో రెండు, మూడు మ్యాచ్?లు ఆడే ఛాన్స్ ఉంటుంది. అందుకే ఈ జైస్వాల్ రికార్డు ఈ సీజన్?లోనే బ్రేక్ అయినా ఆశ్చర్యం లేదు!..

# కోహ్లీని చూసి నేర్చుకోండి.. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ జరుగుతున్న సమయంలో క్రికెటర్లు సోషల్ మీడియా యాక్టివిటీస్ కంటే కూడా ఆన్-ఫీల్డ్ పర్ఫార్మెన్స్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు. ఆటగాళ్లు రీల్స్ చేయడం, బిహైండ్ ది సీన్స్ కంటెంట్ తయారు చేయడంలో సమయాన్ని వృథా చేయకుండా క్రికెట్ పైనే పూర్తిగా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆధునిక క్రీడల్లో సోషల్ మీడియా అనేది ఒక ముఖ్యమైన భాగంగా మారినప్పటికీ, ఐపీఎల్ లాంటి పెద్ద టోర్నమెంట్లలో అది ఆటగాళ్లకు ఒక డిస్ట్రాక్షన్‌గా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని ధుమాల్ నొక్కి చెప్పారు. ఈ మేరకు ఆయన ఆటగాళ్ల ప్రవర్తనపై కొన్ని కీలక మార్గదర్శకాలను పంచుకున్నారు. తాజాగా ఒక వార్తా సంస్థతో మాట్లాడిన ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఈ సందర్భంగా ఒక పర్ఫెక్ట్ ఉదాహరణగా పేర్కొన్నారు. విరాట్ కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నప్పటికీ, ఆయన మైదానంలో ఉన్నప్పుడు కేవలం ఆటపైనే వంద శాతం ఫోకస్ పెడతారని గుర్తు చేశారు. కోహ్లీ తన అద్భుతమైన ప్రదర్శనల ద్వారానే ఎప్పుడూ రిజల్ట్స్ సాధించాడని, సోషల్ మీడియా రీల్స్ ద్వారా కాదని ఆయన స్పష్టం చేశారు. క్రికెటర్లు రీల్స్ లాంటి వర్చువల్ విషయాల కంటే రియాలిటీ పైనే ఫోకస్ పెట్టాలని హితవు పలికారు. టోర్నమెంట్ జరుగుతున్నంత కాలం ఆటగాళ్లు ఇలాంటి రీల్స్ చేయడానికి దూరంగా ఉండటమే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు.లో




## ఐపీఎల్ కోసం స్వదేశాన్ని ఛీకొట్టిన మొహమ్మద్ అమీర్

భారతదేశంలో నిర్వహించే ఐపీఎల్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లపై దశాబ్దాలుగా నిషేధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే, మొహమ్మద్ అమీర్ తాజాగా బ్రిటీష్ పాస్‌పోర్ట్ సాధించి, అధికారికంగా బ్రిటన్ పౌరసత్వాన్ని పొందాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం పాకిస్థాన్ పాస్‌పోర్ట్ కలిగిన ఆటగాళ్లపై మాత్రమే నిషేధం ఉంది కానీ, పాక్‌లో జన్మించిన వారిపై కాదు. అమీర్ ఇప్పుడు బ్రిటీష్ పౌరుడిగా ఐపీఎల్ వేలంలో తన పేరును నమోదు చేసుకోవడానికి చట్టపరంగా పూర్తి అర్హత సాధించాడు. గతంలో పాక్ మాజీ ఆల్‌రౌండర్ అజహర్ మహమూద్ కూడా ఇదే విధంగా బ్రిటన్ పౌరసత్వంతో కింగ్స్ ఎలెవన్ పంజాబ్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత భారత ప్రభుత్వం, బీసీసీఐ కలిసి పాక్ ఆటగాళ్లను ఐపీఎల్‌కు దూరం పెట్టాయి. దీనికి తోడు 2010లో ఇంగ్లాండ్ పర్యటనలో మొహమ్మద్ అమీర్ స్పాట్ ఫిక్సింగ్ వివాదంలో చిక్కుకుని ఐదేళ్లపాటు అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిషేధానికి గురయ్యాడు. ఆ తర్వాత పునరాగమనం చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో రాణించినప్పటికీ, పాక్ పాస్‌పోర్ట్ కారణంగా అతడికి భారత్‌లో అడుగుపెట్టే అవకాశం దక్కలేదు. ప్రస్తుతం ఐసీసీ విధించిన పాత నిషేధాలన్నీ ముగిసిపోవడం, చేతిలో బ్రిటీష్ పాస్‌పోర్ట్ ఉండటంతో చట్టపరమైన అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. బ్రిటన్ కోటాలో మొహమ్మద్ అమీర్ రాబోయే 2027 ఐపీఎల్ వేలంలో తన పేరును నమోదు చేసుకునే అవకాశం ఉంది. ట్వంటీ-20 క్రికెట్‌లో అతడికి ఉన్న అద్భుతమైన రికార్డు, అనుభవం దృష్ట్యా ఏ జట్టుకైనా అతడు కీలక బౌలర్‌గా మారగలడు. అయితే, చట్టపరంగా అర్హత సాధించినప్పటికీ, వేలంలో ఏ ఫ్రాంచైజీ అయినా అతడి కోసం బిడ్ వేస్తుందా లేదా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కాగితాల పరంగా, నిబంధనల పరంగా అమీర్‌కు లైన్ క్లియర్ అయినప్పటికీ, అతడు ఐపీఎల్ మైదానంలో అడుగుపెట్టడం అంత సులువు కాదు. ఎందుకంటే ఐపీఎల్ కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదు, దీని వెనుక కోట్ల మంది భారతీయుల సెంటిమెంట్ దాగి ఉంది. ముఖ్యంగా ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో దేశంలో పాక్ పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాభిప్రాయాన్ని, దేశ భద్రతను గౌరవించే బీసీసీఐ, కేంద్ర ప్రభుత్వం.. పాక్ మూలాలున్న ఆటగాడిని లీగ్‌లోకి అనుమతించే విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తాయి. మొహమ్మద్ అమీర్ బ్రిటన్ పౌరసత్వం పొందడం ద్వారా ఐపీఎల్ తలుపులు తట్టినట్లయింది. కానీ, భారత్-పాక్ మధ్య ఉన్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతలు, కార్పొరేట్ ఫ్రాంచైజీల భయాల మధ్య అమీర్ ఐపీఎల్ కల నెరవేరుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. కేవలం నిబంధనలు మారినంత మాత్రాన, మారవని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.




## రిషభ్ పంత్ నోట బూతు మాటలు

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ మరో ఓటమిని మూట గట్టుకుంది. ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లలో తొమ్మి దింటిలో పరాజయం పాలైంది. దీంతో ప్లేఆఫ్స్‌లో చోటు కోల్పోయింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో కొనసాగుతోందీ జట్టు. ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అది లాంఛనప్రాయమే. గెలిచినా, ఓడినా పెద్దగా తేడా ఉండదు. ప్లేఆఫ్స్ కు ఏ రకంగానూ దోహదపడదు. రాజస్థాన్ రాయల్స్ పై భారీ స్కోర్ చేసినప్పటికీ.. జట్టు ఓడిపోవడం కేప్టెన్ రిషభ్ పంత్ కు మింగుడు పడట్లేదు. తీవ్ర అసహనానికి గురయ్యాడు. పోస్ట్ మ్యాచ్ ప్రజంటేషన్ సందర్భంగా మాట తూలాడు. బూతు మాట మాట్లాడు. "ఔవ ఖతీవ ఖ టలిలిలిఅఅస్త్ర త్రశీశీన్ ఘ్రఎ.." అని వ్యాఖ్యానించాడు. మిగిలిన వాటి కంటే కూడా నిజంగా గొప్ప జట్టు అని ధీమా వ్యక్తం చేశాడు.పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న చివరి మ్యాచ్‌పై గురించి అడిగినప్పుడు పాజిటివ్ గా బదులిచ్చాడు పంత్. "మా ప్రస్తుత పరిస్థితి ఎలా ఉన్నా, ఒక జట్టుగా మేము గర్వపడుతున్నాం. మాకున్న టీమ్ ఎలాంటిదో మాకు తెలుసు, మేము కచ్చితంగా గెలవగలమని నమ్ముతున్నాం.



# బంగ్లాదేశ్ చేతిలో పాకిస్తాన్ చిత్తు

పాకిస్తాన్ కు వరుస పరాజయాల బెడద తప్పట్లేదు. బంగ్లాదేశ్ చేతిలో మరోసారి చిత్తు చిత్తుగా ఓడింది. సిల్హెట్ స్టేడియంలో బంగ్లాదేశ్ తో జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పరాజయాన్ని చవి చూసింది. రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్‌ను 0-2 తేడాతో ఓడిపోయింది. బంగ్లాదేశ్ చేతిలో వైట్ వాష్ కు గురైంది. ఈ మ్యాచ్‌లో 437 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక పాకిస్తాన్ 358 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది.. ఆతిథ్య జట్టుకు ఘన విజయాన్ని అందించింది.తొలి ఇన్నింగ్ లో బంగ్లాదేశ్ 278 పరుగులకు ఆలౌట్ అయింది. లిట్టన్ దాస్ సెంచరీతో కదం తొక్కాడు. 126 పరుగులు చేశాడు. పాకిస్తాన్ బౌలర్లల్లో ఖుర్రం షెహజాద్- 4, మహ్మద్ అబ్బాస్- 3 వికెట్లతో చెలరేగారు. బౌలర్లు రాణించినా బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్ లో 232 పరుగులకే చాప చుట్టేసింది పాకిస్తాన్. బాబర్ ఆజమ్ చేసిన 68 పరుగులే టాప్ స్కోర్. లోయర్ ఆర్డర్ బ్యాటర్ సాజిద్ ఖాన్ 38 పరుగులతో ఆదుకోకపోతే మరింత అధ్వాన్నంగా మారేదా జట్టు పరిస్థితి.రెండో ఇన్నింగ్ లో కూడా తన దూకుడు కొనసాగించింది బంగ్లాదేశ్. ఈ ఇన్నింగ్ లో కూడా సెంచరీ నమోదైంది. ముష్ఫికుర్ రహీం 137 పరుగులు బాదాడు. అతనికి తోడుగా ఓపెనర్ మహ్మదుల్ హసన్ జాయ్- 52, లిట్టన్ దాస్ 69 పరుగులు చేయడంతో బంగ్లాదేశ్ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. 390 వద్ద నిలిచింది. మొత్తంగా 437 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ ఇన్నింగ్ పడుతూ లేస్తూ సాగింది. జట్టు స్కోర్ 41 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఓపెనర్లిద్దరూ అవుట్ అయ్యారు. అజాన్ అవైస్- 21, అబ్దుల్లా ఫజల్- 6 పరుగులకు పెవిలియన్ చేరారు.ఆ తర్వాత కేప్టెన్ షాన్ మసూద్- 71, బాబర్ ఆజమ్- 47 పరుగులతో మూడో వికెట్ కు భారీ భాగస్వామ్యాన్ని అందించారు. వీరిద్దరూ అవుట్ అయ్యాక కూడా అదే పోరు కొనసాగింది. లోయర్ మిడిల్ ఆర్డర్ లో సల్మాన్ ఆఘా- 71, వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్- 94 పరుగులతో గెలిపించే ప్రయత్నం చేశారు గానీ మిగిలిన బ్యాటర్ల నుంచి వారికి ఎటువంటి సహకారం అందలేదు. సవూద్ షకీల్- 6, సాజిద్ ఖాన్- 28 పరుగులు చేయగా.. హసన్ అలీ, ఖుర్రం షెహజాద్ డకౌట్ అయ్యారు. దీంతో 358 పరుగుల వద్ద పాకిస్తాన్ ఇన్నింగ్ చతికిలపడింది. బంగ్లాదేశ్ బౌలర్ తైజుల్ ఇస్లాం.. పాకిస్తాన్ బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచాడు. ఆరు వికెట్లు పడగొట్టి ఆ జట్టు పతనాన్ని శాసించాడు. నహీద్ రానా- 2 వికెట్లు తీసుకోగా.. షోరిఫుల్ ఇస్లాం, మెహదీ హసన్ మిరాజ్ ఒక్కో వికెట్ నేల కూల్చారు.




# తారక్‌కు అభినందనల వెల్లువ

మే20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్- త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళు న్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు.




# డ్రాగన్‌లో ఎన్టీఆర్ పేరు..లూగర్

అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' ఫస్ట్ గ్లింప్స్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదలై సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. అయితే ఈ గ్లింప్స్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన ప్రధాన అంశం ఎంటంటే.. ఎన్టీఆర్ క్యారెక్టర్ పేరు 'లూగర్'. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను చాలా పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తాడన్న సంగతి తెలిసిందే. కేజీఎఫ్ లో 'రాకీ', సలార్ లో 'దేవా' అలాగే ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రకు 'లూగర్' అనే వెరైటీ పేరు పెట్టడం వెనుక ఒక బలమైన కారణం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై చిత్రబృందం స్పందించకపోగా.. 'లూగర్' అనే పదానికి గూగుల్, వీకిపిడియాలో ఒక అర్థం కనిపిస్తుంది. అది ఏంటి అనేది చూసుకుంటే. 'లూగర్' అనేది ఒక క్లాసిక్ జర్మన్ పిస్టల్ (తుపాకీ) పేరు అని తెలుస్తుంది. వరల్డ్ వార్ సమయంలో జర్మనీ సైన్యం ఉపయోగించిన ఈ లూగర్ పిస్టల్.. అత్యంత ఖచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి, క్రూరత్వానికి మారుపేరని సమాచారం. సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక సాధారణ మనిషిలా కాకుండా, ఒక లోడెడ్ గన్‌లా.. శత్రువులను వేటాడే ఒక ప్రాణాంతక ఆయుధంలా ఉండబోతోంది. అందుకే ప్రశాంత్ నీల్ ఈ పేరును ఎంచుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ'కి చెందిన 'అసాసిన్-ఇన్-చీఫ్' ప్రధాన షార్ప్ షూటర్గా కనిపిస్తున్నారు. 1967 కాలానికి చెందిన అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) వ్యాపారం, స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు భారతదేశాన్ని విడిచి వెళ్ళిన తర్వాత ఓపియం వ్యాపారం 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ', 'గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ'లుగా విడిపోతుంది. ఈ క్రమంలో జరిగే రక్తపాతం, మాఫియా యుద్ధాల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత నటిస్తుండగా.. నటిస్తున్నారు.




# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్ సోషల్ మీడియాలో షేక్

దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక్ బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాక్‌డ్రాప్‌లో, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీఆర్ లుక్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ రఫ్ అండ్ లీన్ లుక్, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీఆర్ చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్తీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక్ బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టించిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టార్ అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు భువన్ గౌడ విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం 5 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 11, 2027న థియేటర్లలోకి రానుంది.

# దురంధర్-2పై హైకోర్టులో వ్యాజ్యం


బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చుని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన కే కానుంది.






# బాలకృష్ణ మూవీలో మంచు మనోజ్

'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ బ్జడెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘనవిజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.




# ఓటిటిలోకి సతీ లీలావతి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల వివాహం తర్వాత వెండితెరపై నటించిన సరికొత్త రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం సతీ లీలావతి. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా, 'భీమిలి కబడ్డీ జట్టు'వంటి చిత్రాల ఫేమ్ డైరెక్టర్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో, థియేట్రికల్ రన్ చాలా త్వరగానే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఎవరూ ఊహించని విధంగా కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఈ సినిమాను ఓటీటీ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. మెగా ఫ్యామిలీకి చెందిన ఒక నటి నటించిన సినిమా ఇంత తక్కువ సమయంలో ఓటీటీ బాట పట్టడం టాలీవుడ్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రముఖ డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్‌లు 'సన్ నెక్స్ట్' తో పాటు జియో హాట్‌స్టార్‌లు ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, మే 20 నుంచే తెలుగుతో పాటు తమిళ భాషల్లోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే కథలో లీలావతి (లావణ్య త్రిపాఠి) ఒక స్టార్ డైరెక్టర్. చిన్నతనం నుంచి తల్లిదండ్రుల కావాలని రామ్ సేతు భార్యను కోరతాడు. దీంతో షాక్‌కు గురైన లీలావతి భర్తను ఇంట్లోనే బంధిస్తుంది.


PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656